

ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

ఎడిటర్ : నాగేంద్ర  పేజీలు : 4  సంపుటి : 1  - సంచిక 211  ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ  శనివారం 09- 11 - 2024  వెల-2


## అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయండి: షర్మిల

ఈ నెల 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు

2లో

విపక్ష హోదా లేకుండా అసెంబ్లీకి వెళ్లి ఏం ఉపయోగం అన్న జగన్

అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవుల్లో ఉండడం ఎందుకున్న షర్మిల




## కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ రెడ్డి సరిపోడు

'కనకపు సింహాసనమున' పద్యం సీఎంకు సరిగ్గా సరిపోతుందన్న హరీశ్ రావు

రేవంత్ రెడ్డి తప్పు మీద తప్పు చేస్తున్నారని మండిపాటు

మూసీ మురికి నీళ్లతో కడిగినా రేవంత్ నోటి మురికి పోదని వ్యాఖ్య



తెలంగాణ (రిపబ్లిక్ న్యూస్):

సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోడని... సీఎం తన స్థాయిని దిగజారి మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'కనకపు సింహాసనమున శు నకము కూర్చుండబెట్టి శుభలగ్నమునం దొనరగ బట్టము కట్టిన వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ!' అంటూ పద్యాన్ని కూడా రాసుకొచ్చారు.

-మిగతా 2లో



## విజయవాడ టు శ్రీశైలం
## సీ ప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్

14 సీట్లతో రూపకల్పన

రేపు ప్రారంభించనున్న ఏపీ సీఎం చంద్రబాబు

# దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశం

వర్గీకరణ అమలుపై సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

2లో

అధ్యయనానికి త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడి

జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పిన సీఎం



## లోకేశ్, పవన్, అనితలకు సారీ చెప్పిన శ్రీరెడ్డి




## మీకంటే ఉన్మాదులు ఎవరైనా ఉన్నారా?

సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం

అర్ధరాత్రి అరెస్ట్ చేస్తున్నారని ఆరోపణ

చంద్రబాబు చేసిన పాపాలకేమీ తక్కువలేదని వ్యాఖ్యలు



వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందంటూ ఆ పార్టీ మహిళా నేత లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. సోషల్ మీడియా కార్యకర్తలను అర్ధరాత్రి అరెస్ట్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. చంద్రబాబు చేసిన పాపాలకేమీ తక్కువలేదని, అలాంటి వ్యక్తి ఇవాళ వైసీపీని ఉన్మాదుల కర్మాగారం అంటున్నాడని లక్ష్మీపార్వతి తెలిపారు. "మీకంటే ఉన్మాదులు ఎవరైనా ఉన్నారా? ఒక్కసారి 1993 నుంచి చూసుకుందాం... ఆ రోజు ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి నన్ను బూచిగా చూపారు. లక్ష్మీపార్వతి ఓ రాజ్యాంగేతర శక్తి అని ప్రచారం చేశారు. లక్ష్మీపార్వతి కారణంగానే ప్రభుత్వాన్ని మేం స్వాధీనం చేసుకున్నామని మొత్తం నామీదే నిందలు మోపారు.

## రేపు మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

రేపు ముంబైలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల సమావేశం

సమావేశానికి హాజరు కానున్న ఏఐసీసీ ముఖ్యనేతలు

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ముంబైకి వెళ్లనున్న సీఎం

2లో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు మహారాష్ట్రకు వెళ్ళనున్నారు. ముంబైలో రేపు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. ఈ సమావేశం కోసం ఆయన రేపు ఉదయం వెళుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి ముంబై చేరుకుంటారు. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహం, రూపొందించాల్సిన మేనిఫెస్టోపై సలహాలు, ఇతర అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నారని తెలుస్తోంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులతో పాటు ఏఐసీసీ అగ్రనేతలు, ముఖ్యనేతలు పాల్గొననున్నారు.



## జగన్ పిటిషన్ పై ఎన్సీఎల్టీలో విచారణ వాయిదా

తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను ప్రతివాదులుగా పేర్కొంటూ జగన్ పిటిషన్

తనకు తెలియకుండా షేర్లు బదిలీ చేసుకున్నారని ఆరోపణ

షేర్ల యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

కౌంటర్ దాఖలుకు సమయం కోరిన విజయమ్మ, షర్మిల తరపు న్యాయవాది

వివరాలు 2లో




## సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ బర్త్‌డే విషెస్

రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించిన ప్రధాని

రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవి

ఈ ఏడాది రేవంత్ రెడ్డికి అద్భుతంగా సాగాలని ఆకాంక్షించిన చిరు

2లో



# అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయండి: షర్మిల

మచిలీపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పుడు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి ఏం ఉపయోగం అంటూ జగన్ పేర్కొనడంపై షర్మిల స్పందించారు.

అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవుల్లో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు వెళ్లనివారు పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అది జగన్ అయినా, ఇతర వైసీపీ ఎమ్మెల్యేలైనా... అసెంబ్లీకి వెళ్లే ఆలోచన లేనప్పుడు పదవుల నుంచి తప్పుకోవాలని సూచించారు.

# కేసీఆర్ కాలిగోటికి కూడా రేవంత్ రెడ్డి సరిపోడు

ఇది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సరిగ్గా సరిపోతుందన్నారు.

రేవంత్ రెడ్డి తప్పుమీద తప్పు చేసి వదరబోతులా ప్రవర్తిస్తున్నారని, ఆయన తీరును ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నీ పుట్టిన రోజు నాడు... తండ్రి వయసున్న కేసీఆర్ మీద, తెలంగాణ కోసం కొట్లాడిన గొప్ప వ్యక్తి మీద, నువ్వు చేసిన నీచమైన వ్యాఖ్యలు అత్యంత హేయమని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నీలాగా వికృతంగా మాట్లాడే ముఖ్యమంత్రిని ఈ దేశం ఎప్పుడూ చూసి ఉండదన్నారు. మూసీ నీళ్ళ మురికితో కడిగినా నీ నోరు మురికి పోదని... నీ వంకర బుద్ధి మారదని అన్నారు.

నీలాగా చిల్లరగా మేం మాట్లాడలేమన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని, అభివృద్ధి పథంలో నడిపిన గంభీరమైన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. కానీ బ్యాగులు మోసి, బ్యాగులు పంచి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర నీదని ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. నీ దోపిడీని, నీ దొంగబుద్ధిని నిరూపించి ప్రజా క్షేత్రంలోనే నీకు బుద్ధి చెబుతాం అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పిచ్చి ప్రగల్భాలు మానుకొని పరిపాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. నిరంకుశత్వాన్ని మానుకొని నిర్మాణాత్మక నిర్ణయాలపై శ్రద్ధ వహించాలన్నారు.

# జగన్ పిటిషన్ పై ఎన్సీఎల్టీలో విచారణ వాయిదా

వైసీపీ అధినేత జగన్ తమ కుటుంబ ఆస్తుల వ్యవహారంలో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ) లో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. ఈ పిటిషన్ లో ఆయన తన తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను ప్రతివాదులుగా పేర్కొనడం సంచలనం సృష్టించింది.

తనకు సమాచారం అందించకుండా తల్లి, సోదరి షేర్లు బదిలీ చేసుకున్నారని జగన్ తన పిటిషన్ లో ఆరోపించారు. షేర్ల బదిలీ ఫారాలు సమర్పించకుండానే తమ పేరిట మార్చుకున్నారని వివరించారు. జగన్, వైఎస్ భారతి, క్లాసిక్ రియాలిటీ పేరిట షేర్లు కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్ లో కోరారు. 51.01 శాతం షేర్లు యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తాజాగా, ఎన్సీఎల్టీ ఈ పిటిషన్ పై నేడు విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా... కౌంటర్ దాఖలు చేసేందుకు కొంత సమయం కావాలని విజయమ్మ, షర్మిల తరఫు న్యాయవాది ఎన్సీఎల్టీని కోరారు. అనంతరం, ఎన్సీఎల్టీ విచారణను డిసెంబరు 13కు వాయిదా వేసింది.

# కదంతొక్కిన గిరిజన విద్యార్థులు




**ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్న విద్యార్థులు**

**జిల్లా కేంద్రంలో ర్యాలీ, ఐటీడీఏ ముందు ధర్నా**

**జీవో 3ని పునరుద్ధరణ, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉద్యోగాలను ఎస్టీలతోనే భర్తీ చేయాలని డిమాండ్**

**పాడేరు,** జీవో 3ని పునరుద్ధరించాలని, ఏజెన్సీలో ఉద్యోగాలను గిరిజన అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తొలుత గిరిజన సంఘం నేతలు, విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం నుంచి ఐటీడీఏ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాల్‌దేవ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ మాట్లాడుతూ.. గిరిజన స్పెషల్ డీఎస్సీ ద్వారా మాత్రమే గిరిజన ప్రాంతంలోని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఆదివాసీ షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో గిరిజనులకు న్యాయం చేయకుంటే చలో అసెంబ్లీ చేపడతామని ప్రకటించారు.

**గిరిజనులకు అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వం**

జీవో 3ని 2020లో రద్దు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం దానిపై కనీసం రివ్యూ పిటిషన్ అయినా దాఖలు చేయలేదని పి.బాల్‌దేవ్, కె.రాధాకృష్ణ విమర్శించారు. గిరిజన ప్రాంతంలోని కేజీబీవీలు, ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఉపాధ్యాయులు, మినిమమ్ టైమ్ స్కేల్ టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను సైతం గిరిజనులు కాని వారితో భర్తీ చేసిందన్నారు. అలాగే గిరిజనులకు న్యాయం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యలతో గిరిజనులకు తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే తాము అధికారంలోకి వస్తే జీవో 3ని పునరుద్ధిస్తామని ఈ ఏడాది జనవరి 20న అరకులోయలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని, ఆయన హామీ మేరకు జీవో 3ని పునరుద్ధరించాలన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యపై చర్చ జరగాలని నేతలు కోరారు. అనంతరం వారి సమస్యలపై ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, కార్యదర్శి పాలికి లక్కు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవన్, కృష్ణ, ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, వివిధ గిరిజన సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశం

కూటమి పార్టీ దళిత ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేలతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ అమలుపై కీలక నిర్ణయాన్ని తెలియజేశారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం జిల్లా యూనిట్ గా వర్గీకరణ అమలు చేయనున్నట్లు ప్రకటించారు. అధ్యయనానికి త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యం లేకుండా నెల రోజుల్లోనే నివేదిక అందేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వర్గీకరణ అమలు ద్వారా దళితుల్లోని ఉప కులాలందరికీ సమాన అవకాశాలు కల్పించి వారికి ఊతం ఇచ్చేలా పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు సూచనలు చేయగా, వాటిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుతో పాటు ఎన్నికల్లో హామీ కూడా ఇచ్చామని, టీడీపీయే మొదటి నుంచి దళితులకు అండగా ఉందని సీఎం అన్నారు.

దళితుల అభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పాటు అందిద్దామని పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల్లో 29 ఎస్సీ శాసనసభ నియోజకవర్గాల సీట్లకు గానూ 27 స్థానాల్లో కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించారని, వారి నమ్మకాన్ని నిజం చేస్తామని తెలిపారు.

ఒక్కసారి ఎమ్మెల్యేగా ఉంటారా.. మరింత కాలం ఎమ్మెల్యేగా ఉంటారా? అనే విషయం మీ చేతుల్లో కూడా ఉందంటూ సీఎం చలోక్తి విసిరారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం అమలుపై ఎప్పటికప్పుడు చర్చించేందుకు తరచు దళిత ఎమ్మెల్యేలతో సమావేశం కావాలని ఈ సందర్భంగా సీఎం నిర్ణయించారు.

# మీకంటే ఉన్మాదులు ఎవరైనా ఉన్నారా?

ఆ రోజున 75 ఏళ్ల వయసులో ఎన్టీఆర్ ను ఎంతో క్షోభకు గురిచేసి, ఆయనను పరలోకానికి పంపించావు. మీకు తోడు ఈనాడు పత్రిక. పిచ్చి పరాకాష్ఠకు చేరిందో, అంతకుమించిన స్థాయికి చేరిందో కానీ... అప్పటినుంచి సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని మీరిద్దరూ ఆడుతున్న నాటకాన్ని, మీ దుర్మార్గమైన చర్యలను ఎప్పటికప్పుడు అడ్డుకోవడానికి ఎవరో ఒకరం వస్తూనే ఉన్నాం. అయినప్పటికీ మీలో మార్పేమీ లేదు.

ఈ ప్రపంచంలో ఎవరైనా మారతారేమో కానీ... చంద్రబాబు, ఈనాడు వంటి పనికిమాలినవాళ్లు ఎప్పటికీ మారరు. ఈనాడును చెత్తబుట్టలో వేయాలని ఎన్టీఆర్ ఎప్పుడో చెప్పారు. అలాంటి, చెత్తబుట్టలో వేయాల్సిన పేపర్ ను అడ్డుపెట్టుకుని ఈ రోజు మీరు ఆడుతున్న నాటకాలు స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ఇప్పుడు రామోజీ లేకపోయినా ఆయన కొడుకు తయారయ్యాడు. జగన్ ప్రభుత్వంలో మార్గదర్శిపై కేసు వేస్తే, ఈ ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకుంది. ఈ కేసులో మేం పాలుపంచుకోవడంలేదని చెప్పింది.

ఆ రోజు ఎన్టీఆర్ గారు, నేను ఎంతో కష్టపడి అధికారాన్ని సాధించుకున్నాం. సోషల్ మీడియా లేని ఆ రోజుల్లో కూడా పేపర్లో నీచమైన రాతలు రాయించారు. ఇంతకంటే ఉన్మాద చర్య ఇంకొకటి ఉంటుందా? ఇవన్నీ మేం అంటున్న మాటలు కాదు... చంద్రబాబు నాకంటే పెద్ద నటుడు అని, అతడికి రామోజీ తోడయ్యాడు... ఇద్దరూ కలిసి ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేస్తున్నారు అని ఆ రోజున ఎన్టీఆర్ కూడా అన్నారు.

ఎన్టీఆర్ గారు నిన్ను తిట్టని తిట్టు లేదు. ఆడియోలు, వీడియోలతోనూ తిట్టారు. దాన్ని బట్టే నువ్వెలాంటి వాడివో అర్థమవుతుంది" అంటూ లక్ష్మీపార్వతి సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోదీ బర్త్‌డే విషెస్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు.

"తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఆయన దీర్ఘకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

మోదీ బర్త్‌డే విషెస్‌పై స్పందించిన రేవంత్ రెడ్డి.. "హృదయపూర్వక శుభాకాంక్షలకు కృతజ్ఞతలు" అని రీట్వీట్ చేశారు.

మరోవైపు మెగాస్టార్ చిరంజీవి కూడా సీఎం రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది రేవంత్ రెడ్డికి అద్భుతంగా సాగాలని, ఆయన దీర్ఘాయుష్షుతో పాటు మంచి ఆరోగ్యంతో ఉండాలని చిరంజీవి ఆకాంక్షించారు.

"గౌరవనీయులైన సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు! ఈ ఏడాది మీకు అద్భుతంగా ఉండాలి. ప్రజల సేవలో మీరు విజయవంతం కావాలి. మంచి ఆరోగ్యంతో దీర్ఘాయుష్షు పొందాలని కోరుకుంటున్నాను!" అని చిరు ట్వీట్ చేశారు.కాగా, సీఎం రేవంత్ రెడ్డి 1969 నవంబర్ 8న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్‌లోని కొండారెడ్డి పల్లిలో జన్మించారు. శుక్రవారంతో ఆయనకు 55 ఏళ్లు. ఇక రేవంత్ రెడ్డి 2023 డిసెంబర్ 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యునిగా పనిచేశారు.

# అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్!

ప్రజాస్వామ్య పవనాలను ఎవరు ఆపగలరు? మరి రెండు నెలలలోగా ముగియనున్న 2024 సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామిక సమాజాలకు ఒక మరపురాని ప్రత్యేక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఎన్నికల సంవత్సరాలు అన్నిటికీ తల్లిలాంటి ఈ సంవత్సరంలో 60కు పైగా దేశాలలో జాతీయ స్థాయి ఎన్నికలు జరిగాయి. అనేక దేశాలలో ప్రజలు దిగ్భ్రాంతికరమైన తీర్పునిచ్చారు. ప్రభుత్వాలు మారాయి. ఎదురులేని మొనగాళ్లలా వ్యవహరించిన నేతలు అధికార వైభవం కోల్పోవడమో లేక తగ్గిపోవడమో జరిగింది. గతంలో ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులు అనూహ్యమైన ప్రజా మద్దతుతో మళ్లీ అధికారానికి వచ్చారు.

ఈ ఏడాది వేసవిలో భారతీయ ఓటర్లు నడుస్తున్న చరిత్రను విస్మయపరిచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి 400కు పైగా సీట్లు ఖాయమనుకుంటే గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఆ పార్టీ ఈ సారి పార్లమెంటరీ మెజారిటీని కోల్పోయింది. ప్రధాని మోదీ ఒక సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అనివార్యమయింది. ఆ తరువాత జూలైలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పథనిర్దేశకులు అయిన బ్రిటిష్ ప్రజలు యువనేత, సాహసోపేత ప్రధానమంత్రి రిషి సునాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేశారు. ప్రతిపక్షమైన లేబర్ పార్టీని అనూహ్య మెజారిటీతో గెలిపించారు. సునాక్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని చాలా మంది ముందుగానే భావించినప్పటికీ లేబర్ పార్టీకి తిరుగులేని మెజారిటీ లభించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఇక అమెరికా. ప్రపంచంలో అత్యంత పురాతన ప్రజాస్వామిక దేశమైన అమెరికాలో మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఘనవిజయంతో చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడుగా ఉండి ఎన్నికలలో ఓడిపోయి తదుపరి పర్యాయం అధ్యక్ష ఎన్నికలలో ఘనవిజయం సాధించిన అధ్యక్షుడుగా ట్రంప్ తనకొక విలక్షణ కీర్తిని సృష్టించుకున్నారు. గత 120 సంవత్సరాలలో ఒక అధ్యక్షుడు ఒకసారి విజితుడై మళ్లీ విజేత కావడం ఇదే మొదటిసారి. రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేసిన మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ తరపున పోటీ చేసిన కమలా హారిస్ మధ్య పోటీ సమస్థాయిలో ఉందని ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేమని ఓటర్ల సర్వేలు ఘంటాపథంగా వెల్లడిస్తూ వచ్చాయి. అయితే అమెరికన్ ఓటర్ల తీర్పు ఆ అంచనాలకు విరుద్ధంగా ఉండి ప్రపంచ ప్రజలను చకితపరిచింది.

ప్రపంచ ప్రధాన ప్రజాస్వామిక దేశాల ప్రజల తీర్పులలో ఒక స్పష్టమైన పద్ధతి లేదా రీతి గోచరమవుతుందా? ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎన్నిక, అధికారంలో ఉన్న నేతలు, పార్టీలకు ఒక స్పష్టమైన హెచ్చరికే అవడం పరిపాటి. అధికారంలో ఉన్న వారి పట్ల ఓటర్లలో వ్యక్తమయ్యే అసంతృప్తి, ఆగ్రహం పాలకులకు తెలుస్తూనే ఉండడం కూడా కద్దు. తత్కారణంగా తాము అధికారాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుందనే జడుపు కూడా వారికి కలుగుతుంది. అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఓటమికి ఒక ప్రధాన కారణం. పదవీ విరమణ చేయనున్న అధ్యక్షుడు జో బైడెన్ ప్రభుత్వ పాలన, విధానాలలో ఆమె భాగస్వామ్యమే.

ప్రజలలో సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందనే సూత్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత సార్వత్రిక ఎన్నికల వరకు ఒక మినహాయింపుగా ఉండేవారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఆయన పార్టీ సైతం 63 స్థానాలను కోల్పోయింది. ఒక దశాబ్ద కాలంగా బీజేపీలోను, దేశ రాజకీయాలలోను తిరుగులేని రీతిలో ఉన్న ప్రభావ ప్రాబల్యాలకు తీవ్ర విఘాతం వాటిల్లింది. నిజమైన ప్రజాస్వామ్య ఎన్నికలలో ఒక అధికార పక్షం గతంలో కంటే మరింత మెజారిటీతో మళ్లీ అధికారానికి రావడమనేది అరుదుగా జరుగుతుంది. ప్రజలలో ప్రభుత్వ వ్యతిరేక మనస్థితి నెలకొనడానికి కారణం ఆర్థిక వ్యవస్థ. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రభుత్వాలు కోవిడ్ అనంతర ఆర్థిక దురవస్థల నెదుర్కోవడంలో సతమతమవుతున్నాయి. సంపన్న రాజ్యమైన అమెరికాలో సైతం కొత్త ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఉన్న ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రజల ఆదాయాలు పడిపోయాయి. జీవన వ్యయాలు అంతకంతకు పెరిగిపోసాగాయి. మరి స్వల్ప ఆదాయాలతో బతుకులను ఈడుస్తున్న కార్మిక శ్రేణులు డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి మద్దతుదారులుగా ఉండడంలో ఆశ్చర్యమేముంది? ఆర్థిక వ్యవస్థను బాగుపరచగల సమర్థుడు ఎవరన్నదే ఓటర్ల ఆలోచన. అటువంటి సమర్థ నేతను వారు ట్రంప్‌లో చూశారు. ఆయన విజేత అయ్యారు. భారత్‌లో సైతం లోక్‌సభ ఎన్నికలలో అటువంటి పరిస్థితే ఉన్నది.. ఉదాహరణకు 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అన్న నినాదం దళిత ఓటర్లను బాగా ప్రభావితం చేసింది. రిజర్వేషన్ల ప్రయోజనాలను కోల్పోవడం జరిగితే తమకు ఉద్యోగావకాశాలు దాదాపుగా మృగ్యమవుతాయని దళితులు భయపడ్డారు. సరే, రైతుల దుస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వ్యవసాయ రంగ దురవస్థలు, అనిశ్చిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పాలక బీజేపీ 'చార్ సౌ ఆర్' స్వప్నాన్ని భంగపరిచాయి.


ఓటర్ల ప్రాధాన్యాల్లో సాంస్కృతిక గుర్తింపు ఒక ప్రధాన అంశంగా ఉండడమనేది ప్రజల తీర్పుల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. ఉదాహరణకు అమెరికాలో కమలా హారిస్ మద్దతుదారులు మరింత సమ్మిళిత 'కొత్త' అమెరికాను నిర్మించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అన్ని మతాల, సకల జాతుల ప్రజలను సమానంగా గౌరవించే ఒక 'కొత్త' అమెరికాను నిర్మించుకోవల్సిన సమయమాసన్నమయిందని వారు వాదించారు. అమెరికన్ సమాజం 'వైవిధ్యం'తో వర్ధిల్లాలన్న వాదనను డోనాల్డ్ ట్రంప్ తలకిందులు చేశారు. వలస వచ్చిన, వస్తున్న వారికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడారు. భిన్న జాతుల, మతాలకు చెందిన వలసకారులు అమెరికన్ల శ్రేయస్సును దెబ్బ తీస్తున్నారని ఆయన వాదించారు. ట్రంప్ ధోరణి గత లోక్‌సభ ఎన్నికలలో ప్రధాని మోదీ, బీజేపీ నాయకుల ధోరణికి భిన్నమైనది కాదు.

నాగరిక విలువలు సమున్నతంగా ఉన్న ప్రపంచంలో అయితే, ట్రంప్, మోదీ, యోగి లాంటి నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలు తీవ్రంగా గర్హింపబడేవి. అయితే 2024 ఎన్నికల ప్రచారాల్లో అటువంటి వ్యాఖ్యలు ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులను తమ ఊహాత్మక 'అంతర్గత' శత్రువుకు వ్యతిరేకంగా పరిణమింపచేశాయి. మరింత సమ్మిళిత సమాజం కోసం కమాలా హారిస్ చేసిన విజ్ఞప్తిని ఆమె ప్రత్యర్థులు పూర్తిగా వామపక్ష%-% ఉదార వాద రాజకీయ దృక్పథానికి మితిమీరిన ప్రాధాన్యమిస్తుందని, అది 'శ్వేతజాతి' అమెరికన్ల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని దుయ్యబట్టారుబీ మన దేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నెహ్రూ ఆదర్శానికి నిబద్ధులయిన వారిని 'బూటకపు లౌకికవాదులు'గా కొట్టివేయడం జరుగుతుంది.

ఒక విధంగా శక్తిమంతమైన రాజకీయ నాయకులు అయిన డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఒకే విధమైన విజయ సూత్రాన్ని కనుగొన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోదీ పూయించగా 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్%-% మోదీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడం ఇరువురి ప్రచారాలలో ఒక ఉమ్మడి అంశం. అమెరికాలో ప్యూరిటోరికన్, హైతియన్ వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్, భారత్‌లో రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీ ఘుస్ పేటియా (చొరబాటుదారులు)కు వ్యతిరేకంగా మోదీ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో భాగంగానే 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు రెచ్చగొట్టడం జరుగుతోంది. ఒక విభిన్న అస్తిత్వాన్ని పటిష్ఠం చేసుకునేందుకు అనుసరిస్తున్న జాగరూక వ్యూహమది: అమెరికాలో ట్రంపియన్ అమెరికనిజం, భారత్‌లో బీజేపీ హిందుత్వ భావజాలాలు ఒక జాతీయవాద దాడిగా వ్యక్తమవుతున్న అదుపులేని, చేయలేని సాంస్కృతిక వక్కాణింపు ప్రాతిపదికపై ప్రభవించినవే.

ఈ వ్యూహాలు చెప్పుకోదగిన రీతుల్లో ఫలిస్తున్నాయి. కారణమేమిటి? అటు అమెరికాలోను, ఇటు భారత్ లోను ప్రతిపక్షాలు తమ సొంత ప్రత్యేక విధానాలను ప్రతిపాదించడానికి బదులుగా, భావజాల ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను సవాల్ చేయడమనే వలలో చిక్కుకోవడమే. భారత్‌లో ప్రతిపక్షాలు ఎంతకూ మోదీని విమర్శించడానికే పరిమితమవుతున్నాయిబీ అలాగే అమెరికాలో డెమొక్రాట్లు అమెరికా భవిష్యత్తు విషయమై ఒక సుసంబంధ దార్శనికతతో ఓటర్లను కొత్త సమున్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించడానికి బదులుగా నిరంతరం ట్రంప్ వ్యక్తిత్వంలోని లోపాలు, లొసుగులను ఎండగట్టేందుకే పరిమిత మయ్యారు. ఈ క్రమంలో ట్రంప్ తనను ప్రత్యర్థుల కుట్రకు బాధితుడుగా, వాషింగ్టన్ అధికార వ్యవస్థకు 'బయటి వ్యక్తి'గా చిత్రించుకోవడంలో సఫలమయ్యారు. నరేంద్ర మోదీ తనను తాను 'చాయ్ వాలా కా బేటా'గా చెప్పుకుంటూ 'నామ్ దార్' ప్రత్యర్థులను ఎదుర్కొంటున్న 'కామ్ దార్'గా తనను అభివర్ణించుకుని దేశ ప్రజలను ఆకట్టుకున్న విషయం మనకు బాగా తెలుసు.

డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోదీ ఇరువురూ స్వతంత్రంగా, సొంత పద్ధతులతో తమ రాజకీయ విజయాలను సాధించుకున్న సమర్థులే. మోదీ తరచు తన విమర్శకులు ఎంతగా పొరపడుతున్నారో రుజువు చేసిన నాయకుడు. ట్రంప్ సైతం ఒకసారి విజితుడు అయిన తరువాత చరిత్రాత్మక విజేతగా ప్రభవించేందుకు తనదైన రీతిలో విజయ పథాన్ని నిర్మించుకున్న అరుదైన నేత. ఐదు సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నికల సందర్భంలో కాబోయే విజేత అని ట్రంప్‌ను మోదీ తొందరపాటుగా ప్రస్తుతించారు. 'అబ్ కి బార్ ట్రంప్ సర్కార్' అని నినదించారు. 2024లో అమెరికా ఎన్నికల తీరుతెన్నులు ఒక కొత్త విశేషాన్ని సంతరించుకున్నాయి. ప్రపంచ రాజకీయాలలో వాక్యూరులకు ఇంకా స్థానమున్నదన్నదే ఆ విశేషం.

# నంద్యాల అనస్థీషియా వైద్యుల సంఘం నూతన కార్యవర్గం

## అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ రవి కృష్ణ , డాక్టర్ మధుసూదన్ రెడ్డి

**నంద్యాల నవంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్):** భారతీయ అనస్థీషియా వైద్యుల జాతీయ సంఘానికి అనుబంధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘంలో భాగంగా అనస్థీషియా వైద్యుల సంఘం నంద్యాల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక బాలాజీ కాంప్లెక్స్ లోని కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

అధ్యక్షులుగా నంద్యాలలో మూడు దశాబ్దాలకు పైగా అనస్థీషియా సేవలు అందిస్తున్న డాక్టర్ జి.రవి కృష్ణ, రెండు దశాబ్దాలకు పైగా అనస్థీషియా సేవలు అందిస్తున్న డాక్టర్ కాతా మధుసూదన రెడ్డి కార్యదర్శిగా,రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధిగా డాక్టర్ డి.నాగరాజా రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ టి.నాగరాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.శేష ఫణి ,డాక్టర్. డి.మాధవి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్. ఆర్. మల్లీశ్వరి, డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా,వైజ్ఞానిక కార్యక్రమాల సమన్వయకర్తగా డాక్టర్ కె.సంపత్ కుమార్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రేచల్ ప్రియాంక, డాక్టర్ శ్రీ లక్ష్మీ, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ చెన్నకేశవ, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ అనూష, డాక్టర్ కవిత, డాక్టర్ రవితేజ, డాక్టర్ శ్రీధర్ రెడ్డి డాక్టర్ ప్రదీప్ లతో నూతన కమిటీ ఏర్పడింది.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ శస్త్ర చికిత్సలలో అనస్థీషియా వైద్యుల పాత్ర చాలా కీలకమని, అనస్థీషియా రంగంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పరిశోధనలు అత్యంత క్లిష్టమైనటువంటి శస్త్ర చికిత్సలు చేయడానికి దోహదం చేశాయన్నారు. అంతేకాకుండా అనస్థీషియా వైద్యులు ఐసీయూ లలో అత్యవసర చికిత్స అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తున్నారని తెలిపారు.

నంద్యాల అనస్థీషియా వైద్యుల సంఘం తరపున అన్ని వర్గాల ప్రజలకు, విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ అంటే అకస్మాత్తుగా రోగి గృహ తప్పడం, గుండె, ఊపిరి ఆగిపోయిన సమయాలలో సత్వర చర్యలపై సి. పి. ఆర్.( గుండె, ఊపిరి తిరిగి పనిచేసేలా చేపట్టే చర్యలు) శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి పౌరునికి ఈ శిక్షణ అవసరమన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అనుమతి లభిస్తే 2026వ సంవత్సరంలో నంద్యాలలో రాష్ట్రస్థాయి అనస్థీషియా వైద్యుల సదస్సు నిర్వహిస్తామని అన్నారు.

# ప్రజలకు గుర్తుండిపోయేలా సేవలందించాలి



## - ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి

**బండి ఆత్మకూరు,నవంబర్ 8, (రిపబ్లిక్ న్యూస్):**– ప్రజలకు గుర్తుండిపోయేలా అధికారులు సేవలు అందించాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో దస్తగిరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించిన అధికారులు ఇక్కడ నుంచి వేరే చోటికి బదిలీపై వెళుతుంటే మండల ప్రజలకు బాధ కలిగే పరిస్థితి కలుగుతుందన్నారు.ఆ విధంగా విధుల పట్ల అంకితభావం,సమయపాలన, ఇతర అధికారులు,ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తే బండి ఆత్మకూరు మండలం ప్రగతి పథంలో నడుస్తుందని ఎంపీపీ అధికారులకు సూచించారు. ముందుగా ఈ సమావేశంలో అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతిని చదివి వినిపించారు.ప్రస్తుతం సుమారు నాలుగు కోట్ల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటరాముడు సభాముఖంగా తెలిపారు. అలాగే ప్రజలకు రాయితీపై సోలార్ విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందనీ విద్యుత్ శాఖ ఏఈ కంబగిరి తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.గతంలో నిర్మాణంలో ఉండి ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను వచ్చే మార్చి నాటికి పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ వాసుదేవుడు తెలిపారు.ఈ క్రమంలో పార్నపల్లి గ్రామ సర్పంచ్ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు మంజూరు అవుతున్నాయని జియో టాకింగ్ కోసం వచ్చే హౌసింగ్ సిబ్బంది స్థానిక నాయకులు



చెబితేనే జియో ట్యాగ్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు.ఇలా చాలామంది అర్హులైన గృహ నిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు రాగల రమణ, ముంతల మధురాని, తహసిల్దార్ ధోని ఆల్ఫ్రెడ్, ఆర్డబ్ల్యూస్ ఎఈ లక్ష్మీ నరసింహ, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ భావన,వ్యవసాయ అధికారి స్వాతి, ఏపీవో వసుధ, పంచాయతీ సెక్రటరీలు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ సోసియల్ మీడియా వారికన్నా పశువులు నయం

## మహిళల జోలికి వస్తే తాట తీస్తా అన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంఘీభావం తెలుపుదాం
## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల ప్రతినిధి, నవంబర్ 8, రిపబ్లిక్ న్యూస్. ::** రాష్ట్రంలో వైసీపీ సోసియల్ మీడియా వారి ఆరాచకాలకు అడ్డు అదుపులేకుండా ఉందని, వారికన్నా పశువులు ఎంతో నయమని, మహిళల జోలికి వస్తే తాట తీస్తా అన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంఘీభావం తెలుపుదామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

శుక్రవారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ బైరెడ్డి శబరి ఇంట్లో విలేకరులతో మాట్లాడుతూ అధికారం పోయిందన్న అక్కసుతో వైసీపీ నాయకులు, వారి సోసియల్ మీడియా ద్వారా టీడీపీ, జనసేన మహిళలపై అసభ్యకరంగా, మహిళలను కించపరుస్తూ పోస్టింగ్స్ పెట్టడం చాలా భాధేస్తుందని, అసలు వీళ్ళు మనుషులేనా అన్న సందేహం కలుగుతుందన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూతుళ్ళపై కూడా వైసీపీ సోసియల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్స్ పెట్టడం వారి ఆరాచక నైజం తెలియజేస్తుందని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా కఠినంగా వ్యవహారిస్తూ కేసులు నమోదు చేసి వైసీపీ సోసియల్ మీడియా వారిని జైల్లో పడుతున్నారని, వారిలో మార్పు రాకుంటే ఇంకా కఠినంగా చర్యలు తీసుకోక తప్పదన్నారు. నంద్యాల జిల్లాలో మహిళల జోలికి వస్తే తీవ్ర



పరిణామాలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

# విద్యార్థి అమరవీరుల స్పూర్తితో ఉద్యమిద్దాం

## -శాస్త్రీయ విద్యా సాధనకై పోరాడండి

**నంద్యాల ప్రతినిధి. నవంబర్ 08 .రిపబ్లిక్ న్యూస్. ::** ):శాస్త్రీయ విద్య సాధనకై, సమసమాజ స్థాపనే ద్యేయంగా, ఆధిపత్య, అనువాద, విద్యకాషాయికరణను వ్యతిరేకించాలని పిడిఎస్యూ

విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభను నంద్యాల పట్టణంలో భవన విజయం జూనియర్ కళాశాలలో పిడిఎస్యూ పట్టణ నాయకులు గోపాల్ అధ్యక్షత జరిగింది.ఈ సభకు పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, జిల్లా నాయకులు మధు కిరణ్ మాట్లాడుతూ విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించుటకై, సమాజంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలని, సమ సమాజ స్థాపనకై అసువులు బాసిన విద్యార్థి అమరవీరులు కామ్రేడ్ జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి,చేరాలు, కోలాశంకర్ అని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రగతిశీల విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేసిన కామ్రేడ్ జార్జిరెడ్డి మరణానంతరం జార్జిరెడ్డి వారసులుగా, పిడిఎస్యూ స్థాపకుడు జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ అని తెలిపారు. విద్యార్థి అమరవీరుల స్పూర్తితో ప్రైవేటు,కార్పొరేట్ విద్యా వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దోపిడి, పీడన లేని సమాజానికై, కుల,మత,లింగ భేదాలు లేని సమాజానికై ఉద్యమించాలన్నారు. విద్య, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో,



కళాశాలల్లో, యూనివర్సిటీలో, వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారంగా కావాలంటే పోరాటమే మార్గమన్నారు. స్కాలర్షిప్స్ రియంబర్స్మెంట్స్, ఫెలోషిప్స్ రావాలంటే అమరవీరుల స్పూర్తితో విద్యార్థి ఉద్యమాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ పట్టణ నాయకులువేణు,మధు,హరి,వంశీ,కృష్ణ తో పాటు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# చౌడేశ్వరి దేవి విగ్రహం ధ్వంసం

**పాములపాడు నవంబర్ రిపబ్లిక్ న్యూస్. ::** పాములపాడు మండల కేంద్రంలోని పాములపాడు గ్రామ బయట మిట్ట కందల గ్రామానికి వెళ్లే దారిలో గల పొలిమేర చౌడేశ్వరి దేవి విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు గురువారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం అందించారు

ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ చౌడేశ్వరి



దేవాలయం పురాతనమైన ఆలయం అని ఇంతవరకు ఎప్పుడు ఇలాంటి సంఘటన జరగలేదని అమ్మవారి విగ్రహానికి ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని భక్తులు కోరారు

# ఆయుర్వేదంలో దీర్ఘకాలిక రోగాలకు అనువైన మందులు ఉన్నాయి

## -డాక్టర్ డి.సావిత్రి(ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి).





**పాములపాడు నవంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్):**–ఆయుర్వేదంలో దీర్ఘకాలిక రోగాలకు ఉపశమనమునకు మందులు ఉన్నాయని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ డి.సావిత్రి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.సావిత్రి మాట్లాడుతూ ఈ ఆయుర్వేదం అనేది చాలా పురాతనమైన వైద్యం అని, ఇందులో అనుభవం ఉన్న వైద్యులు ఉండి మరియు నాణ్యత కలిగిన మందుల లభ్యమైతే, శస్త్ర చికిత్స అవసరంలేని రోగములన్నింటికి కూడా నయం చేయవచ్చునన్నారు. మన పాములపాడు ఆయుర్వేద వైద్యశాలకు మండలంలోని ప్రజలే కాకుండా, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి కూడా రోగులు చాలామంది వస్తున్నారని, వాళ్ళందరూ కూడా ఆయుర్వేద మందులను వాడి, వారి రోగాలు నయం చేసుకొని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తున్నారన్నారు. ఇక్కడ వైద్య సేవలతో పాటు, ఇద్దరు యోగ మాస్టర్లచే వెల్నెస్ సెంటర్ ను కూడా ప్రజల కోసం నిర్వహిస్తున్నామన్నారు. ఆయుర్వేదము నందు చెప్పబడిన ఆహార, విహార, పత్య, యోగ విధానంతో ద్వారా ఆరోగ్యమును కాపాడుకొని సుఖంగా జీవించవచ్చు అన్నారు. ఎటువంటి కండరాల నొప్పులకైన కూడా ఆయిల్ తో పాటు, ఇన్ఫ్రా రెడ్ బల్బ్ ద్వారా తగ్గిస్తున్నామన్నారు. గతంలో ఆయుర్వేద మందుల కోసం చాలా ఇబ్బంది పడే వారమని, ఇప్పుడు వైద్యశాలలను ఆధునికరణ చేసి , మందులు కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నదని అన్నారు. మా హాస్పిటల్ లో చర్మ రోగాలకు, కాలేయ రోగములకు, మూత్ర రోగములకు, స్త్రీ రోగములకు, బాలింతల వ్యాధులకు, మలబద్ధకమునకు తగిన మందులు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా,మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ ఎస్.మహబూబ్ బాషా, వైద్య సిబ్బంది ఎం.రవి, తదితరులు పాల్గొనడం జరిగింది.

# చికెన్ సెంటర్ ముసుగులో

## అక్రమాలు చేస్తే చూస్తూ సహించేది లేదు...
## ఏమైనా సమస్యలు ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావాలి..




**ఆళ్లగడ్డ నవంబర్ 8 రిపబ్లిక్ న్యూస్** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో బీరువాల భాష అనే వ్యక్తి ఎన్నో అక్రమాలకు పాల్పడుతూ ముస్లిం మైనారిటీలను రెచ్చగొట్టడం సబబు కాదని మాజీ జెడ్పిటిసి సభ్యుడు చాంద్ భాష, టీడీపీ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ భాష తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్వగృహంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని ఏఎన్ఆర్ చికెన్ షాప్ ను ఓపెన్ చేయించాలని నిన్న జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసి మీరు వాళ్ళ భాష అనే వ్యక్తి వినతి పత్రం అందజేశారని తెలిపారు. ఆళ్లగడ్డ కు చెందిన హర్షవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి తనను బెదిరించి తమ దుకాణాన్ని ముగించాడని దుకాణం యజమాని తో పాటు బీరువాల భాష ఆరోపించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఆళ్లగడ్డలో సంఘసంస్కర్త ముసుగులో భాషా చేస్తున్న అక్రమాలు అన్ని ఇన్ని కావని మైనారిటీలను అడ్డం పెట్టుకొని గుప్రమాణిదిని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిని కబ్జా చేయడం జరిగిందని, కాసింతల ఆలయం వద్ద స్థలాన్ని ఆక్రమించి చేసిన అక్రమాలు అందరికీ తెలుసు అన్నారు. ఇక ఏఎన్ఆర్ చికెన్ దుకాణం యజమాని తప్పుడు తూకాలతో ప్రజలను మోసం చేస్తూ చనిపోయిన కోళ్ళను కూడా డ్రెస్సింగ్ చేసి చికెన్ అమ్మడం, మార్కెట్ ధరల కన్నా ఎక్కువ వసూలు చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారని చాంద్ భాషా ఆరోపించారు. ఏమైనా సమస్యలుంటే ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. ఏఎన్ఆర్ చికెన్ దుకాణంలో జరిగే అక్రమాలపై విచారణ జరిపించాలని చనిపోయిన కోళ్లను కూడా హొటల్లకు అమ్మతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పిటిసి సభ్యుడు చాంద్బాషా మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పలువురు టిడిపి నాయకులు కూడా పాల్గొన్నారు.

# నేషనల్ హైవేలో పోతున్న కృష్ణారావుపేట గ్రామ మైనార్టీ స్మశాన వాటికను కాపాడాలని ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కి వినతి పత్రం అందించిన గ్రామస్తులు

**నందికొట్కూరు నవంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్):**–పాములపాడు మండలంలోని, కృష్ణరావుపేట గ్రామంలో ఉన్న 500 కుటుంబాల మైనార్టీ ఉన్న అర్ధ ఎకరా స్మశానాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి లింగాల.స్వాములు మాదిగ ల ఆధ్వర్యంలో కృష్ణరావు పేట మైనార్టీ, దూదేకుల కు చెందిన 500 కుటుంబాల పెద్దలు శుక్రవారం అల్లూరు గ్రామంలోని, టిడిపి కార్యాలయంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త. జయసూర్య ని కలిసి వినతి పత్రం అందించారు. స్మశాన వాటిక రక్షణకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు పుల్లయ్య,గ్రామ మైనార్టీ నాయకులు సైపుద్దిన్, ముర్తుజావలి, భాష, తెలుగుదేశం పార్టీ నియోజవర్గ నాయకులు మాంద్ర.సురేంద్రనాథ్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎ.మద్దిలేటి, సోషల్ మీడియా ప్రతినిధి పసుల.శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు..



## విజయవంతంగా కాన్వాయ్ ట్రైల్ రన్ నిర్వహణ



నంద్యాల క్రైం, నవంబర్ 8, (రిపబ్లిక్ న్యూస్): శ్రీశైలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న సందర్భంగా భద్రతా చర్యలలో భాగంగా శుక్రవారం కాన్వాయ్ ట్రైల్ రన్ ను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో కొనసాగింది. పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద సురక్షితంగా ల్యాండ్ సీ ప్లేన్ అయింది. ట్రైల్ రన్ కాన్వాయ్ పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద నుండి రోప్ వే మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్, నంది మండపం మీదుగా టెంపుల్ వద్దకు చేరుకోవడం జరిగింది. అనంతరం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవారిని దర్శించుకుని తిరిగి కాన్వాయ్ మీడియా పాయింట్, పాతాళగంగ బోటింగ్ పాయింట్ వద్దకు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ఏఎసెల్ బృంద అధికారులు, ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ కు వచ్చే అర్జీల ను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

### జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ.



కర్నూలు, నవంబరు, 08, రిపబ్లిక్ న్యూస్. :: ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ రిజిస్ట్రేషన్ ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్" కు వచ్చే అర్జీల తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేసేలా కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా రెవెన్యూ అధికారి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్"కు వచ్చే దరఖాస్తులకు తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయు విధానంపై కంప్యూటర్ ఆపరేటర్లకు ఈరోజు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్ నందు తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వచ్చిన అర్జీ ఏ డిపార్ట్మెంట్ సంబంధించినదని తెలుసుకొని ఆ డిపార్ట్మెంట్ వారికి పంపించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల సమయం వృధా కాకుండా నిర్ణీత సమయంలోనే అర్జీదారునికి సమస్య పరిష్కరించవచ్చున్నారు. వచ్చిన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా తీసుకోవాల్సిన చర్యలపై కంప్యూటర్ ఆపరేటర్లకు, అవగాహన కల్పించడంతో పాటు పిజిఆర్ఎస్ లో అప్లోడ్ చేసిన తప్పుడు ఎండార్స్మెంట్స్ పై పిజిఆర్ఎస్, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## మహానందీశ్వర దంపతులకు వైభవంగా పల్లకీ సేవ



మహానంది, నవంబర్ 8, రిపబ్లిక్ న్యూస్: మహానందిలో కొలువైన మహానందీశ్వర దంపతులకు కార్తీక మాసం, శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని, అర్చకులు ముందుగా శ్రీ మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకి ఉత్సవం కన్నులపండువగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు పల్లకిని మోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.





## జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పెద్ద ఎత్తున మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.

### డ్వాక్రా బజార్ లో అన్ని ఉత్పత్తులు లభించే విధంగా మరింత అభివృద్ధి చేయాలి.

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

కర్నూలు, నవంబరు, 08, రిపబ్లిక్ న్యూస్ :

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పెద్ద ఎత్తున మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం స్థానిక సి.క్యాంప్ లో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహిళా మార్ట్ లో చేస్తున్న విక్రయాలు చేస్తున్న వస్తువులను పరిశీలించారు..ఎంత మేరకు విక్రయాలు జరుగుతున్నాయి అని మహిళలను అడిగి తెలుసుకున్నారు.. మార్ట్ ను మరింత అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం డ్వాక్రా బజార్ లో విక్రయిస్తున్న డోర్ మాట్స్,జీన్స్ ప్యాంట్స్, స్వయం సహాయ సంఘాల మహిళలు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అక్కడే విక్రయిస్తున్న జీన్స్ ప్యాంట్స్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జీన్స్ ప్యాంట్లు విక్రయిస్తున్నట్లు వినియోగదారులకు తెలిసేలా ఆకర్షణీయంగా డిస్ప్లేచేయాలని సూచించారు.. . జిల్లాలో స్వయం సహాయక సంఘాలు తయారుచేసే అన్ని ఉత్పత్తుల తో డ్వాక్రా బజార్ ను మరింత అభివృద్ధి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

జిల్లాలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పెద్ద ఎత్తున మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని

కలెక్టర్ డిఆర్డిఏ పిడిని ఆదేశించారు.. పెద్ద పెద్ద మార్టులు, షాపులతో టై అప్ చేసి మార్కెటింగ్ లింకేజి డెవలప్ చేయాలని సూచించారు.. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులతో ఒక ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్డిఏ పిడి నాగశివ లీల తదితరులు పాల్గొన్నారు

## సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందజేయాలి.

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా.

కర్నూలు, నవంబరు, 08, రిపబ్లిక్ న్యూస్ :

సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

శుక్రవారం స్థానిక సి.క్యాంప్ లోని సచివాలయం 61, 62 లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా సచివాలయంలోని సిబ్బంది హాజరు పట్టిక, ఇతర రికార్డులను పరిశీలించారు.. సచివాలయ సిబ్బంది కొంతమంది మాత్రమే ఉండడంతో ఎక్కడికి వెళ్లారని కలెక్టర్ ఆరా తీశారు.. వీఆర్వో బదిలీపై వెళ్ళారని,శానిటేషన్ సెక్రటరీ సెలవు పై వెళ్లారని62వ సచివాలయ సిబ్బంది బి ఎల్ ఓ సమావేశానికి హాజరయ్యారని తెలిపారు.. ఈ అంశంపై కలెక్టర్ మునిసిపల్ కమిషనర్ తో మాట్లాడి ధ్రువీకరించుకున్నారు. రోజుకు ఎంత మంది వస్తున్నారు,ఏ విధమైన సర్వీసులు ఇస్తున్నారు అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు గడువు లోపు సేవలను అందించాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు..

జిల్లా కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మెప్మా పిడి నాగ శివ లీల తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితుడికి అందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



నంద్యాల ప్రతినిధి, నవంబర్ 8, రిపబ్లిక్ న్యూస్. :: ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం యరుగుడిదిన్నే గ్రామానికి చెందిన భాధితుడు కంచర్ల కృష్ణచైతన్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు.శుక్రవారం శిరివెళ్ల మండలం గుంప్రమాను దిన్నే మజారా గ్రామంరాజానగ రంలో ఉత్తర అమెరికా దేశం తెలుగు సంఘం( తానా) అధ్య క్షులు శృంగవరం నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథి గా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరు అయ్యా రు. ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ రుద్రవరం మండలం యరగుడిదిన్నే గ్రామానికి చెందిన కంచర్ల కృష్ణ చైతన్య అనారోగ్యంతో భాధ పడుతూ తన ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ ను కోరగా ఎంపీ లెటర్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన సీఎం చంద్రబాబు భాధితుడికి రూ. 2,28,700 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, ఈ రోజు భాదితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందించామని, ఎంపీ గా తాను అడిగిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రికి ఎంపీ బైరెడ్డి శబరి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో తానా అధ్యక్షులు శృంగవరం నిరంజన్, శిరివెళ్ల మాజీ ఎం పి పి శ్రీకాంత్ రెడ్డి, మాజీ వి ఆర్ ఓ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## తానా సేవలు నంద్యాల జిల్లా వ్యాప్తంగా విస్తరించాలి

### ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

నంద్యాల ప్రతినిధి, నవంబర్ 8, రిపబ్లిక్ న్యూస్. ::

అమెరికా దేశంలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం సేవా కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లావ్యాప్తంగా విస్తరించాలని నంద్యాల పార్ల మెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

శుక్రవారం ఆళ్లగడ్డ నియోజ కవర్గం శిరివెళ్ల మండలం గుంప్రమానుదిన్నే మజారా రాజానగరం గ్రామంలో తాన సంఘం అధ్యక్షులు శృంగవరం నిరంజన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఎన్ ఆర్ ఐ ల సేవలు వెనుకబడ్డ ప్రాం తాల అభివృద్ధికి ఎంతో అవస రం అన్నారు. మారుమూల గ్రామం రాజానగరంలో జన్మించి అమెరికా దేశంలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షులుగా కొనసా గుతున్న శృంగవరం నిరంజన్ ధన్యుడని, ఆయన ఆధ్వర్యం లో నంద్యాల జిల్లా వ్యాప్తంగా తానా సేవా కార్యక్రమాలు విస్తరించాలని అందుకు ఎంపీ గా తన సంపూర్ణ సహాయ సహకారం ఉంటుందని బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. తానా అధ్యక్షులు నిరంజన్ సహకా రంతో రాజానగరం జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాల 100 మం ది విద్యార్థినులకు ఉచితం గా సైకిల్లు, 50 మంది గ్రామ మహిళలకు ఉపాధి కోసం కుట్టు మిషన్లు పంపిణి చేయడం అభినందనీయం అన్నారు. ఈ తానా సేవలు ఇంకా విస్తరించి నంద్యాల జిల్లాలో పేదరిక నిర్మూలనకు పాటుపడాలని ఎంపీ శబరి కోరారు. తానా అధ్యక్షులు శృంగవరం నిరంజన్ ను గ్రామస్థులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, శిరివెళ్ల మాజీ యం పి పి శ్రీకాంత్ రెడ్డి, మాజీ విఆర్వో మోహన్ రెడ్డి, నంద్యాల టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండేందుకే నంద్యాల జిల్లా కేంద్రంలో ఇల్లు, ఆఫీస్ ప్రారంభం

### – ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నంద్యాల ప్రతినిధి నవంబర్ 8, రిపబ్లిక్ న్యూస్. ::

నంద్యాల పార్లమెంట్ సభ్యురాలుగా గెలిపించుకున్న నా జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకే నంద్యాల జిల్లా కేంద్రం బొమ్మలసత్రంలో ఇల్లు, ఎంపీ కార్యాలయం సాధాసీధగా శుక్రవారం అర్చకులచే పూజలు చేసి ప్రారంభిచామని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

నంద్యాల బొమ్మలసత్రం లో అర్చకులచే శుక్రవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు చేసి, ఇంట్లో పాలు పొంగించి, గోవుకు పూజ చేసి ఇంట్లో కలియతిప్పి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గృహప్రవేశం, నంద్యాల పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలను ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ జిల్లా కేంద్రం, పార్లమెంట్ కేంద్రం అయిన నంద్యాల పట్టణంలో ఇల్లు, ఆఫీస్ తీసుకొని జిల్లా ప్రజలకు సేవ చేస్తా అన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, వీరసింహారెడ్డి, గోరుకల్లు ఎరుకలయ్య, మద్దూరు గ్రామ సర్పంచ్ జి. ప్రదీప్ రెడ్డి, గణపం పుల్లారెడ్డి, కోడూరు సంజీవరెడ్డి, బొమ్మిరెడ్డి, డాక్టర్ ఎం. రామిరెడ్డి, అజయ్, గోపాల్ యాదవ్, పుసులూరు మాజీ సర్పంచ్, సతీష్ కుమార్, కానాల గురునాద్ రెడ్డి తదితరులు ఎంపీ శబరి గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com